క్లుప్తంగా

సుబ్రహ్మణ్య స్వామికి షష్టి పూజలు



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

మద్దికెర : స్థానిక ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి బుధవారం షష్టిని పురస్కరించుకొని విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. స్వామి వారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజలు, మహామంగళహారతి తదితర కార్యక్రమాలు చేపట్టారు. దేవసేన, శ్రీవల్లి సమేతుడై కొలువు తీరగా అర్చకులు హోమాలు జరిపించారు. భక్తులకు అన్నదానం చేశారు.

విద్యార్థులకు భగవద్గీత గ్రంథాల పంపిణీ



వెల్దుర్తి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు భగవద్గీత అందిస్తున్న దృశ్యం

వెల్దుర్తి(కృష్ణగిరి): విద్యార్థి దశ నుంచి భగవద్గీత వంటి గ్రంథాలు చదివి సన్మార్గంలో నడవాలని లెక్చరర్ ఖాజా పిలుపునిచ్చారు. వెల్దుర్తిలోని జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు బుధవారం ఆయన తిరుమల తిరుపతి దేవస్థానం ముద్రించిన భగవద్గీతను ఉచితంగా పంపిణీ చేశారు. భగవద్గీతలో అనేక విజయాలకు సంబంధించిన అంశాలు ఉన్నాయన్నారు. దీన్ని ప్రతి ఒక్కరు చదివి అందులో జ్ఞానాన్ని సంపాదించుకోవాలని సూచించారు. 200 మంది విద్యార్థులకు గ్రంథాలను అందజేశారు. సినీ నటుడు దివాన్వలి, లెక్చరర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో వీధులను ఆక్రమిస్తే చర్యలు



మెదేహాల్‌లో రోడ్లపై పారుతున్న నీటిలో ఇబ్బందిపడుతూ నడుస్తున్న ఆర్డీఓ

హాలహర్వి: గ్రామాల్లోని వీధుల స్థలాలను ఆక్రమించి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తీసుకుంటామని పత్తికొండ ఆర్డీఓ భరత్‌నాయక్ హెచ్చరించారు. బుధవారం సాయంత్రం మండలంలోని మెదేహాల్ గ్రామంలో వీధులను ఆక్రమించారనే ఫిర్యాదుపై పర్యటించి స్థలాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని స్థానిక అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ నజ్మాబాను, డీటీ లక్ష్మి, వీఆర్వో మస్తాన్, పంచాయతీ కార్యదర్శి ఈరన్న పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త



బొమ్మగుండనహళ్లిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ బాల నరసింహులు

హొళగుంద: వివిధ రకాల మోసాలకు పాల్పడే సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎస్‌ఐ బాల నరసింహులు సూచించారు. బుధవారం రాత్రి బొమ్మగుండనహళ్లి గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు. అపరిచితులు ఫోన్ చేస్తే బ్యాంక్ అకౌంట్ నంబర్లు, పాస్‌వర్డ్ ఇవ్వరాదని చెప్పారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం, సరైన రికార్డులు లేకుండా వాహనాలు నడపడటం, హెల్మెట్ పెట్టుకోకపోవడం చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనుమతులు లేకుండా బాణసంచా కలిగి ఉంటే చర్యలు తప్పవన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

వెల్దుర్తి(కృష్ణగిరి): మండలంలోని సూదెపల్లె గ్రామంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ సీడీపీఓ ల్యూక్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించి విద్యార్థులకు మంచి పోషకాలతో కూడిన భోజనాన్ని అందించాలని కార్యకర్తలకు సూచించారు.

టీడీపీ పాలనలో మహిళలకు భద్రత ఏదీ?

హొళగుంద: టీడీపీ పాలనలో మహిళలకు భద్రత లేదని, అత్యాచారాలు, హత్యలతో అరాచకం కొనసాగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా విమర్శించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలనలో పేదలకు న్యాయం జరగడం లేదని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు కావటం లేదని మండిపడ్డారు. ఇటీవల మహిళలపై అఘాయిత్యాలు మితి మీరిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. పల్లి ఈరన్న ఉన్నారు.



రామదుర్గంలో చివరి దశలో నిలిచి పోయిన గ్రామ సచివాలయ భవన పనులు



గుమ్మనూరులో అర్ధంతరంగా నిలిచిపోయిన గ్రామ సచివాలయ భవన నిర్మాణం



నేమకల్లులో నిలిచిపోయిన రైతు భరోసా కేంద్రం భవన నిర్మాణ పనులు



నగరడోణలో చివరి దశలో నిలిచిన రైతు భరోసా కేంద్రం నిర్మాణం

ఎన్నటికి పూర్తయ్యేను?

పాలనను ప్రజలకు మరింత చేరువ చేయడం, గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య సాధనలో భాగంగా ఐదేళ్ల క్రితం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. గ్రామాల్లో అన్ని వసతులతో ఆధునికతకు అద్దం పట్టేలా నూతన భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసింది. అలాగే వాటికి అనుబంధంగా రైతుల అవసరాలను తీర్చేందుకు ఆర్బీకే భవనాలను నిర్మించేందుకు రూ.కోట్లు విడుదల చేసింది. ఎన్నికల కోడ్ రావడం, ఆ తరువాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం.. టీడీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో చివరి దశలోనున్న పనులు ఎక్కడికక్కడ నిలిచి పోయాయి.

- నిలిచిన గ్రామ సచివాలయ, ఆర్బీకే భవన నిర్మాణాలు
- వైఎస్సార్‌సీపీ హయాంలో 9 గ్రామ సచివాలయ, ఆర్బీకేల మంజూరు
- సచివాలయాల నిర్మాణానికి రూ.3.60 కోట్లు, ఆర్బీకేల పూర్తికి రూ.1.71 కోట్లు విడుదల
- ఐదు సచివాలయ, ఒక ఆర్బీకే భవన నిర్మాణం పూర్తి
- మిగిలినవి వివిధ దశల్లో ఆగిన పనులు



రామదుర్గంలో ఇరుకు గదిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

చిప్పగిరి: వైఎస్సార్‌సీపీ హయాంలో పల్లెల్లో వివిధ ప్రభుత్వ కార్యాలయ భవనాల నిర్మాణాలు, ఉద్యోగుల నియామకంతో పట్టణ వాతావరణం నెలకొంది. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడం, సంక్షేమ పథకాల అమలు మరింత పకడ్బందీగా అమలయ్యేందుకు గత ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. వీటి కింద ఐదేళ్ల పాటు సేవలు సమర్థంతవంతంగా ప్రజలకు అందాయి. దీంతో నాడు ప్రజలు సంతోషంగా ఉన్నారు. ఇక రైతులకు అవసరమైన సేవలను అందించేందుకు వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను నిర్మించి సిబ్బందిని నియమించింది. భూసార పరీక్షల నుంచి విత్తన నాణ్యత, పంటల సాగుపై రైతులకు కీలకమైన సమాచారం, దిగుబడులు పెంచేందుకు అనుసరించాల్సిన ఆధునిక పద్ధతులు, పంట దిగుబడుల కొనగోలు వరకు అన్ని సేవలు అందించాయి. అయితే వీటి భవనాల నిర్మాణానికి గత ప్రభుత్వం కోట్లాది రూపాయలను విడుదల చేసింది. కొన్నిచోట్ల పనులు ఆలస్యం కావడం, ఈలోపు ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో బిల్లులు రాక నిలిచి భవన నిర్మానాలు ఆగిపోయాయి. ఆ తరువాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బిల్లుల విడుదలను పట్టించుకోకపోవడంతో భవనాల నిర్మాణాలు పునః ప్రారంభం కాలేదు. అలాగే పనులు ముందుకు సాగక నిర్మాణాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దీంతో సిబ్బంది ఇరుకు గదుల్లో విధులు నిర్వర్తించలేక ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ప్రజలకు అవస్థలు తప్పడం లేదు.

చిప్పగిరి మండలంలో..

మండలంలోని 16 గ్రామాలకు గాను 9 సచివాలయ భవనాల నిర్మాణానికి రూ.3.60 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. అలాగే 9 ఆర్బీకేల నిర్మాణాలకు రూ.1.71కోట్లు విడుదల చేసింది. ఒక్కో సచివాలయ భవన నిర్మాణానికి రూ.40 లక్షలు వెచ్చించారు. అలాగే ఆర్బీకేల నిర్మాణాలకు రూ.19 లక్షల చొప్పున ఖర్చు చేశారు. చిప్పగిరితో పాటు మండలంలోని ఏరూరు,డేగులహాలు,గుమ్మనూరు,దౌల్తాపురం,బెల్డోణ,నగరడోణ,రామదుర్గం, నేమకల్లు గ్రామాల్లో నిర్మాణాల పనులు జోరుగా సాగాయి. సాధారణ ఎన్నికల కోడ్ వెలవడటానికి ముందు నగరడోణ,చిప్పగిరి,నేమకల్లు,దౌల్తాపురం,ఏరూరు గ్రామాల్లో సచివాలయ భవనాలు, చిప్పగిరిలో ఆర్బీకే నిర్మాణం పూర్తయ్యింది. ఇక రామదుర్గం, డేగులహాలు, బెల్డోణ,గుమ్మనూరు గ్రామల్లో సచివాలయాల నిర్మాణాలు నిలిచిపోయాయి. నగరడోణ,నేమకల్లు,దౌల్తాపురం,ఏరూరు గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. ఇందుకు ప్రధాన కారణం కూటమి ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడమేనని తెలుస్తోంది. ప్రజలకు ఉపయోగ పడే నిర్మాణాల పట్ల పక్షపాతం తగదని పలువురు పేర్కొంటున్నారు.

ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన వెంటనే నిర్మాణాలు చేపడతాం



మండలంలో 4 సచివాలయ భవనాలు, ఎనిమిది రైతు భరోసా కేంద్రాల పనులు మధ్యలో నిలిచిపోయాయి. 9 గ్రామ సచివాలాయాలు, 9 రైతు భరోసా కేంద్రాల్లో 5 గ్రామ సచివాలయాల నిర్మాణాలు ఒక్క రైతు భరోసా కేంద్రం మాత్రమే నిర్మాణం పూర్తయింది. మిగిలిన భవనాల నిర్మాణాలు వివిధ దశలలో ఉన్నాయి. ఎన్నికల కోడ్ వచ్చిన తరువాత పనులు ఆగిపోయాయి. ఆ తరువాత పనులు పునః ప్రారంభంకాలేదు. ప్రభుత్వం నుంచి అదేశాలు వస్తే పూర్తి చేస్తాం.

– చౌడా రెడ్డి, పీఆర్ ఏఈ



చిప్పగిరి జెడ్పీహెచ్ హైస్కూల్‌లో పునాదులకే పరిమితం అయిన అదనపు గదుల నిర్మాణం

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఖోఖో పోటీలకు ఎంపికైన కటారుకొండ విద్యార్థినులతో ఉపాధ్యాయులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన కంబాలపాడు విద్యార్థులు

కృష్ణగిరి: మండలంలోని కటారుకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు రాష్ట్రస్థాయి ఖో–ఖో పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం గోవిందురెడ్డి తెలిపారు. ఈ నెల 22వ తేదీన కర్నూలు ఆవుట్‌డోర్ స్టేడియంలో జరిగిన ఖో–ఖో పోటీల్లో అండర్–14, 17 విభాగాల్లో డి.వైష్ణవి, సి.రాణి ప్రతభ చూపారన్నారు. వీరు నవంబర్ 2వ తేదీ నుంచి అనకాపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. విద్యార్థినులు, ఫిజికల్ డైరెక్టర్ రంగస్వామిని బుధవారం ఉపాధ్యాయులు, పీఎంసీ చైర్మన్ పాండురంగడుతో కలిసి అభినందించారు.

కంబాలపాడు పాఠశాల నుంచి..

కంబాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు సైకిల్ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికై నట్లు హెచ్‌ఎం వెంకటేశ్వర్లు తెలిపారు. 22వ తేదీన కర్నూలులో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో ప్రతిభ చూపి అండర్–14, 17 విభాగాల్లో మధుగౌడ్, రాజశేఖర్, శివరంగడు, రంగముని, శిరిష, ఆఖిల ఎంపికయ్యారన్నారు. వీరు ఈ నెల 26, 27 తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెపఆరు. ఎంపికైన విద్యార్థులను పీడీ లక్ష్మయ్యను బుధవారం అభినందించారు.

• విద్యార్థులకు కంటి పరీక్షలు

మద్దికెర : విద్యార్థులు తప్పనిసరిగా కంటి వైద్యపరీక్షలు చేయించుకోవాలని ప్రిన్సిపాల్ సవిత అన్నారు. బుధవారం స్థానిక ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి చూపు మందగించిన వారికి అద్దాలు ఇస్తారని, మరిన్ని లోపాలు ఉంటే కర్నూలు వైద్యశాలకు పంపుతామని చెప్పారు.

• విద్యార్థినికి ఆర్థిక చేయూత

దేవనకొండ: మండల కేంద్రానికి చెందిన పి.మెహబూబ్ టీ స్టాల్ పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. అతని రెండో కుమార్తె పి.కౌసర్‌బాను స్థానిక జెడ్పీ పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. కొంతకాలంగా విద్యార్థిని అనారోగ్యంతో బాధపడుతోంది. వైద్య పరీక్షలు చేయించగా కేన్సర్‌గా వైద్యులు నిర్ధారించారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న విషయం తెలుసుకుని వైద్యం చేయించేందుకు సరస్వతి విద్యానికేతన్ సిబ్బంది, యాజమాన్యం రూ.15 వేలు బుధవారం అందజేశారు.

• 3న విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

హొళగుంద: మండల కేంద్రం శివారులో వెలిసిన ఆంజనేయస్వామి ఆలయంలో నవంబర్ 3వ తేదీన విఘ్నేశ్వర విగ్రహ ప్రతిష్ఠాపన, ఆలయ ప్రారంభోత్సవం నిర్వహిస్తామని అగ్రహార ఆంజనేయస్వామి సేవా సమితి సభ్యులు బుధవారం తెలిపారు. అజాత శంభులింగ శివాచార్య మహాస్వామి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ చేస్తారని, పురోహితులు రాచయ్యస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

• బదిలీ ఉద్యోగులకు సన్మానం

తుగ్గలి : మండలంలో ఐదేళ్లుగా పనిచేస్తున్న వెలుగు సీసీలు వీరబ్రహ్మేంద్ర ఆచారి బేతంచెర్లకు, శేఖర్ డోన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా స్థానిక స్త్రీశక్తి భవన్‌లో బుధవారం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఏపీఎం రాధాకృష్ణ, సీసీలు, సిబ్బంది, వీవోఏలు బదిలీపై వెళ్తున్న సీసీలను పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. పొదుపు సంఘాల అభివృద్ధిలో వారి కృషి కొనియాడారు.

రైతులంటే అలుసా?

- అధికారుల నిర్లక్ష్యం వల్ల అన్నదాతలు నష్టపోతున్నారు
- విద్యుత్, రెవెన్యూ అధికారులను నిలదీసిన ఎంపీటీసీలు



మాట్లాడుతున్న విద్యుత్ ఏఈ

మద్దికెర : రైతులంటే అలుసా..విద్యుత్, రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని మండల ఉపాధ్యక్షుడు మహేష్ రెడ్డి, సభ్యులు రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అనిత అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వ్యవసాయానికి నంచర్ల ఫీడర్ కింద విద్యుత్ సరఫరా చేసే సమయంలో అకస్మాత్తుగా గుంతకల్లు నుంచి సరఫరా అయ్యే విద్యుత్ సరఫరా చేయడంతో మోటార్లు కాలిపోతుండటంతో తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. చుట్టుపక్కల ప్రజలకు సమాచారం ఇవ్వకుండా విద్యుత్ స్తంభాలు ఇష్టానుసారంగా పాతుతున్నారని దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే రెవెన్యూ అధికారులు మండలంలో దాదాపు 200 మంది రైతులకు సంబంధించిన పొలాలు రికార్డుల్లో ఇనామి భూములుగా నమోదు చేయడంతో రిజిస్టర్ కాక అవస్థలు పడుతున్నారని, పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ హుసేన్ సాహెబ్, విద్యుత్ ఏఈ మహేష్‌రెడ్డి మాట్లాడుతూ ఈ సమస్యలు తమ దృష్టికి రాలేదని ఇక ముందు రాకుండా పరిష్కరిస్తానమని చెప్పారు. అనంతరం ఆయా శాఖల అధికారులు తమ శాఖల ప్రగతిని చదివి వినిపించారు. ఎంపీడీఓ సీవీ కొండయ్య, జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, ఎంపీటీసీలు ఆంజనేయులు, రామకృష్ణ, వేణమ్మ సర్పంచులు సుహాసిని, మల్లికార్జున, విజయుడు, ఆంజనేయులు పాల్గొన్నారు.

పోలీసుల త్యాగాలు చిరస్మరణీయం



ట్రోఫీ అందుకుంటున్న విజేత పోలీస్ జట్టు

పత్తికొండ(తుగ్గలి) : ప్రజా సేవలో ప్రాణాలు అర్పించిన పోలీసుల అమర వీరుల త్యాగాలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో నిర్వహించిన ఉద్యోగుల క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. పోటీల్లో న్యాయవాదులు, వైద్యులు, పోలీసులు, జర్నలిస్టుల జట్లు పాల్గొన్నాయి. ఫైనల్‌లో పోలీసు జట్టు 6 ఓవర్లలో 72 పరుగుల చేయగా, లక్ష్య సాధనలో జర్నలిస్టుల జట్టు 45 పరుగులకు ఆలౌట్ అయింది. 27 పరుగుల తేడాతో పోలీసు జట్టు విజయం సాధించింది. పోలీసు జట్టులో ఎమ్మెల్యే, డీఎస్పీ వెంకటరామయ్య, సీఐలు జయన్న, పులిశేఖర్, అశోక్ కుమార్ క్రికెట్ ఆడి ఉత్సాహపరిచారు. అనంతరం విన్నర్స్, రన్నర్స్ జట్లు ట్రోఫీని అందుకున్నాయి. ట్రైనీ డీస్పీ ఉషశ్రీ, ఏపీ పీఈటీ, ఎస్‌ఏ పీఈ జిల్లా కార్యదర్శి చందునాయక్ పాల్గొన్నారు.

అర్హులైన దివ్యాంగులకు గుర్తింపు కార్డులు



దివ్యాంగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఆలూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయానికి ఎదురుగా ఉన్న సచివాలయం–2 ఆవరణలో బుధవారం దివ్యాంగల ఉపకరణాలపై సర్వే కార్యక్రమాన్ని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ జి.రమాదేవి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన దివ్యాంగులకు ఫిజియోథెరపీ వైద్యరాలు గంగాభవాని ఆక్యుపేజీషియన్ సాయిపూజిత తదితరులు వైద్య పరీక్షలు నిర్వహించారు. గంగాభవాని మాట్లాడుతూ అన్ని రకాలుగా నిర్ధారించిన తర్వాతనే దివ్యాంగులకు గుర్తింపు కార్డులు, ఉపకరణాలను మంజూరు చేస్తామన్నారు. దా దాపు వంద మందికి పైగా వైద్య పరీక్షలు చేశారు. దివ్యాంగుల ఎడ్యుకేటర్లు దావీదు,రమేష్ ఐఈఆర్‌టీ ఇన్‌స్ట్రక్టర్ బి.రామదాస్, పంచాయతీ కార్యదర్శులు జిలానీ, వెంకటనాయుడు, విజయ్‌కుమార్ ఉరుకుందప్ప ఉన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



గూళ్యంలోని ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న వరలక్ష్మి

హాలహర్వి: మండలంలోని గూళ్యం గ్రామంలోని కామధేను ఫర్టిలైజర్స్, కిసాన్‌మాల్ ఫర్టిలైజర్ దుకాణాల్లో జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి, ఆలూరు ఏడీఏ సునీత బుధవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. వారు మాట్లాడుతూ చాలా వరకు ఎరువుల దుకాణాల నిర్వాహకులు రైతులకు ఎరువులు తీసుకున్న తర్వాత రసీదులు ఇవ్వడం లేదనే ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. అలా చేస్తే చట్టరీత్యా నేరమన్నారు. కామధేను ఫర్టిలైజర్ షాపులో 12 మెట్రిక్ టన్నుల యూరియా అమ్మకాలను నిలిపివేసినట్లు చెప్పారు. ఏఓ శివశంకర్ పాల్గొన్నారు.

భారీ వర్షం

- నీట మునిగిన పంట పొలాలు
- ఉప్పొంగిన వేదావతి



నీట మునిగిన కంది పంట

మద్దికెర : మండలంలోని మద్దికెర, ఎడవలి, బొమ్మనపల్లి గ్రామాల పరిసరాల్లో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురవడంతో పంట పొలాలు నీట మునిగాయి. దీంతో తీవ్రంగా నష్టపోతున్నామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మార్లమడికి వద్ద ఉప్పొంగి ప్రవహిస్తున్న వేదావతి నది

హొళగుంద: ఆంధ్ర–కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులోని మార్లమడికి వద్ద ఉన్న వేదావతి (హగరి) నది బుధవారం సాయంత్రం ఉప్పొంగి ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. నది పరివాహక ప్రాంతాల్లో కురిసిన వర్షానికి నదిలో భారీగా వరద నీరు చేరుతూ సాయంత్రం వరద ఉధృతి పెరగడంతో వంతెన పై నీరు చేరి రెండు వైపుల రాకపోకలు నిలిచిపోయాయి. హొళగుంద–బళ్లారి, సిరుగుప్పలకు ప్రధాన రహదారి కావడంతో రాకపోకలు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. రాత్రి వరద ఉధృతి ఇంకా పెరుగుతుండడంతో సమీప గ్రామాలైన మార్లమడికి, హొన్నూరు, నాగరకణ్వే, ముద్దటమాగి, కోగిలతోట తదితర గ్రామాల ప్రజలు ఆందోళనకు చెందుతున్నారు. నది పరిసరాల్లో సాగు చేసిన పంటలు నీట మునిగాయి. వరి, మిరప, పత్తి, వేరుశనగ తదితర పంటలు పూర్తిగ దెబ్బతింటున్నాయి.

• సమస్యల పరిష్కారానికి పోరాడండి

ఆస్పరి: రజక వృత్తిదారుల సమస్యలు పరిష్కారం కోసం పోరాటాలు చేయాలని చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజినేయులు పిలుపునిచ్చారు. బుధవారం రామతీర్థంలో రజక వృత్తిదారుల సమాఖ్య జిల్లా ప్రథమ సదస్సు నిర్వహించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగమయ్య, సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గిడ్డయ్యతో కలిసి మాట్లాడారు. రజక వృత్తిదారుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. చాకిరేవులకు కేటాయించిన స్థలాలను కబ్జా చేయడంతో బతుకు దెరువు కోసం రజకులు వలస వెళ్తున్నారని అవేదన వ్యక్తం చేశారు. నరసింహుడు, హరికృష్ణ, నాగప్ప, రాజశేఖర్, కారన్న, విరుపాక్షి పాల్గొన్నారు.

• అయోడిన్‌తో పిల్లల్లో మానసిక ఎదుగుదల

మద్దికెర : అయోడిన్‌ను సరిపడినంత వినియోగిస్తే పిల్లల్లో మానసిక ఎదుగుదల ఉంటుందని, అలాగే శారీరకంగా వృద్ధి చెందుతారని ప్రభుత్వ వైద్యాధికారిణి రాగిణి, శ్రీలక్ష్మి అన్నారు. బుధవారం అయోడైజ్డ్ ఉప్పు ప్రయోజనాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.

రైల్వే స్టేషన్ ఆధునీకరణ

ఆదోని సెంట్రల్: వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ కింద రైల్వే ఆధునీకరణ పనులకు శ్రీకారం చుట్టింది. రూ.10.26 కోట్లతో ఆదోని రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు కొనసాగుతున్నాయి. వృద్ధులు, వికలాంగులు, చంటి బిడ్డలు, బాలింతలు, గర్భిణుల సౌకర్యార్థం ఒక ప్లాట్‌ఫామ్ నుంచి మరొక ప్లాట్‌ఫామ్‌కు వెళ్లడానికి రూ. 30 లక్షలు వెచ్చించి 3 లిఫ్టులను ఏర్పాటు చేసి ప్రారంభించారు. అలాగే 2, 3 ప్లాట్‌ఫామ్‌లలో ప్రయాణికుల సౌకర్యార్థం రేకుల షెడ్డులను కూడా నిర్మించారు. ప్రయాణికుల సౌకర్యార్థం అదనపు భవనాలను నిర్మిస్తున్నారు.

భూ సమస్యలను పరిష్కరించుకోండి



ముద్దటమాగిలో రీ సర్వే పై జరిగిన గ్రామసభలో పాల్గొన్న అధికారులు

హాలహర్వి: రీ–సర్వేలో నెలకొన్న భూ సమస్యలను గ్రామసభల్లో అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని రీ సర్వే డీటీ బ్రహ్మయ్య సూచించారు. బుధవారం మండలంలోని బేవిన హాల్ గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల తమ సమస్యలపై అర్జీలు అందజేశారు. ఆర్‌ఐ మహేష్, మండల సర్వేయర్ భార్గవి, వీఆర్వో పెద్దన్న, సర్పంచ్ జయశ్రీ పాల్గొన్నారు.

పత్తికొండ(తుగ్గలి) : భూముల రీ సర్వే బుధవారం రెండు గ్రామాల్లో రెవెన్యూ అధికారులు గ్రామ సభలు నిర్వహించారు. తుగ్గలి మండలం జీ.ఎర్రగుడిలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ నాగరాజు, పత్తికొండ మండలం చిన్నహుల్తిలో రీ సర్వే డీటీ బాలరాజునాయక్, ఆర్‌ఐ శ్రీనివాసులు హాజరై రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. మండల సర్వేయర్లు గాదిలింగప్ప, సుధాకర్, వీఆర్వోలు రంగస్వామి, రంగన్న, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

హొళగుంద: ముద్దటమాగి గ్రామంలో బుధవారం రీ సర్వే పై గ్రామసభ జరిగింది. గతంలో జరిగిన రీ సర్వేలో తప్పులు, అభ్యంతరాలు, ఇతర భూ సమస్యలకు సంబంధించి రైతుల నుంచి 54 అర్జీలు వచ్చినట్లు తహసీల్దారు సతీష్‌కుమార్ తెలిపారు. డీటీ నిజాముద్దీన్, సర్వేయర్ డీటీ ముకుందరావు, వీఆర్‌ఓలు నాగరాజు, ప్రహ్లాద, దామోదర, సూరంజనేయులు పాల్గొన్నారు.

ఆలూరు: మండలంలోని మర కట్టు గ్రామంలో బుధవారం గ్రామ సర్పంచ్ ఎల్లప్ప ఆధ్వర్యంలో గ్రామ సభను నిర్వహించారు. తహసీల్దార్ గోవింద్ సింగ్ మాట్లాడుతూ రీ సర్వేలో చోటు చేసుకున్న సమస్యలపై అర్జీలు అందజేస్తే పరిష్కారం చూపుతామని చెప్పారు. సర్వేయర్ అరుణ, వీఆర్వో రవి పాల్గొన్నారు. గురువారం తుంబళబీడు గ్రామంలో గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

తుగ్గలి : నియోజకవర్గ ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు తెలిపారు. ఉపాధి హామీ నిధులు రూ.25 లక్షలతో తుగ్గలిలో నిర్మించిన సీసీరోడ్డు, డ్రైనేజీని బుధవారం ఆయన ప్రారంభించారు. శాలివాహన కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ నాగేంద్ర, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు వరలక్ష్మి దంపతులు, సర్పంచ్ రవి పాల్గొన్నారు.